క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ నేత పల్లె ఆనంద్ తన తల్లిదండ్రులు పద్మమ్మ, వెంకటయ్యల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లె ఆనంద్ మాట్లాడుతూ.. పదేళ్లుగా వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యన్నం శ్రీధర్‌రెడ్డి, అనసూయమ్మ, రాజు, మల్లేశ్‌గౌడ్, సంతోష్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీశైలం, హన్మంత్‌రెడ్డి, బాలోజీ, దశరథ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ ప్రారంభం



బోరు మోటార్ ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: భక్తుల సౌకర్యార్థం కొందుర్గు పెండ్యాల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ఆవరణలో పదేళ్ల క్రితం దాతల సహకారంతో బోరు వేశారు. కానీ కరెంట్ సౌకర్యం లేకపోవడంతో బోరు వినియోగానికి నోచుకోలేదు. కాగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. సోమవారం దాతల సహకారంతో సింగిల్ ఫేజ్ మోటార్ సమకూర్చి అమర్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు బోరు మోటారు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కృష్ణయ్య, రామయ్యగౌడ్, గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, నర్సింలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న శ్రీకాంత్, స్రవంతి దంపతులు

షాద్‌నగర్: పట్టణంలోని పరిగి రోడ్డు పోచమ్మ ఆలయం వద్ద బీజేపీ నేత శ్రీనివాస్‌చారి ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం న్యూసిటీ కాలనీకి చెందిన శ్రీకాంత్, స్రవంతి దంపతులు మజ్జిగను పంపిణీ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

డప్పు కృష్ణకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కులవివక్ష నిర్మూలనకు నిరంతరం కృషి చేసి ఉద్యమాన్ని నడిపించిన డప్పు కృష్ణ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో డప్పు కృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనాన్ని రూపుమాపడం కోసం జరిగిన ఉద్యమంలో డప్పు కృష్ణ చురుకైన పాత్ర పోషించారన్నారు. పేదలకు ఇళ్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ గ్రామాల్లో డప్పు కృష్ణ సైకిల్ యాత్ర నిర్వహించారన్నారు. కులవివక్ష నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, ఈశ్వర్ నాయక్, భుజంగరెడ్డి, మీనాజ్‌బేగం, కావలి రాజు, లక్ష్మి, శ్రీకాంత్, రమేశ్, నవీన్, బుద్దుల జంగయ్య, శివ పాల్గొన్నారు.

'కాసాని' విజయం తథ్యం

కందుకూరు: చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం తథ్యమని మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాసాని గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేసిన అనుభవంతో పాటు ఈ ప్రాంతంపై అవగాహన ఉందన్నారు. నియోజకవర్గంలో కేసీఆర్ బీసీలకు అవకాశం కల్పించారని, పార్టీ కార్యకర్తల తో పాటు బీసీలు మద్దతుగా నిలవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు బీఆర్ఎస్ గెలుపుతోనే న్యాయం జరుగుతుందన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి



ఇంటింటి సర్వేలో వివరాలు సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

షాద్‌నగర్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు 5 రోజులుగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ప్రోగ్రాంలో భాగంగా సోమవారం వలంటీర్లు గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి 15 నుంచి 29 సంవత్సరాలలోపు ఉన్న ఉద్యోగులు, నిరుద్యోగులు, అక్షరాస్యులు, నిరక్షరాసుల వివరాలను సేకరించారు. అదేవిధంగా గ్రామాభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. నేటి సమాజంలో బాలికలకు విద్య ఎంతో అవసరమన్నారు. ప్రతి నిత్యం బాలికలు, మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయని, వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఇంటి ఆవరణతో పాటు వ్యవసాయ పొలాలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. నేడు మనం నాటే మొక్క భావితరాలకు ఫలాలను అందిస్తుందన్నారు. మనం వినియోగించుకున్న నీరు, వర్షపు నీరు వృథాగా పోకుండా తప్పనిసరిగా ఇంకుడు గుంతలను తవ్వుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, అధ్యాపకురాలు శ్రీలక్ష్మి, కళాశాల విద్యార్థినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రాజు



రాజశేఖర్ రాజును సన్మానిస్తున్న న్యాయవాదులు

షాద్‌నగర్: బార్ అసోసియేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రాజు అన్నారు. షాద్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాజు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, విజయభాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, సంయుక్త కార్యదర్శులు మధుసూదన్‌రావు, నరేంద్రనాథ్, కోశాధికారి రాఘవేంద్రచారి, లైబ్రేరియన్ లక్ష్మయ్య, జయమ్మ, శంకర్, శివకుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులను న్యాయవాదులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజశేఖర్ రాజు మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్‌లో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకరావాలన్నారు. అందరికీ మెరుగైన న్యాయ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జగన్‌మోహన్‌రెడ్డి, కంచి రాజగోపాల్, ఎంఏ కరీంఖాన్, వేణుగోపాల్‌రావు, మోహన్‌రావు, కృష్ణారెడ్డి, రఘునాథ్‌శర్మ, శ్రీనివాసమూర్తి, కృష్ణకిషోర్, నడికూడ సత్యనారాయణ, సబియా సుల్తానా, శ్రీనివాస్, రమేశ్, సురేందర్, శివ, మల్లయ్య, కావలి శ్రీశైలం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు నిదర్శనం కాంగ్రెస్

మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి



ఎంపీ రంజిత్‌రెడ్డితో భీంభరత్, తదితరులు

చేవెళ్ల: ప్రజాపాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మున్సిపల్ నాయకులు ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఎంపీగా మరోసారి గెలిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తోందన్నారు. పేద ప్రజలు కోరుకునే ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ పాలనలో వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, మండల నాయకులు ఉన్నారు.

కూలీల సమస్యలు పట్టని కేంద్రం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జంగయ్య

షాద్‌నగర్‌రూరల్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో గల ఈరంచెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కూలీలు పని చేస్తున్నారన్నారు. కేంద్రంలో పీఎం మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి నిధులను తగ్గించడంతో పాటుగా సకాలంలో కూలీలకు బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. ఉపాధి పనులపై కూలీలకు విరక్తి కలిగే విధంగా కేంద్రం వ్యవహరించడం సరికాదన్నారు. వేసవి కాలంలో కూలీలకు కనీస సౌకర్యాలైన మంచినీళ్లు, టెంట్లు, మెడికల్ కిట్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నా పీఎం మోదీ చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, ప్రతి కూలీకి 200 రోజుల పని దినాలను కల్పించాలన్నారు. లేదంటే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

4 నుంచి ద్వితీయ పుష్కర కుంభాభిషేక ఉత్సవాలు

చేవెళ్ల: ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మల్కాపూర్‌లోని శ్రీ భువనేశ్వరీ సహిత పంచలింగేశ్వర, నవగ్రహ, పంచముఖి ఆంజనేయస్వామిల ఆలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలు జగద్గురువు ఆదిశంకరాచార్య, హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీ మహాస్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుతాయని చెప్పారు. ఇందులో భాగంగా 4వ తేదీ గురువారం ఉదయం స్వస్తివాచనము, మంగళవాయిద్యము, చతుర్వేద స్వస్తి, పుణ్యావాచనము, నాంది, అంకురారోపణము, పంచగవ్యమేళనము, పంచగవ్య ప్రాశనము, ఆచార్యాది రుత్విక్ వర్ణనము, యజ్ఞశాల ప్రవేశం, యజ్ఞశాల సంస్కారము, నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాదిమండల దేవతాస్థాపనములు, కుండసంస్కారము, అగ్నిప్రతిష్ఠ, ప్రధాన దేవతా మంత్రహవనములు, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగము, 5వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు స్వస్తివాచనము, ప్రధాన దేవతాపూజలు, నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాదిమండల దేవతామంత్ర హవనములు, మూలమంత్ర హవనములు, హారతి పంచసూక్త హవనము, చండీ హోమము, దుర్గాసప్తశతి, 6వ తేదీ శనివారం జయాదిహోమం, పూర్ణాహుతి, కుంభాభిషేకము, అలంకరణ, హారతి, తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. మండలంలోని ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ

ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని వరంగల్ సుమతి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీ తెలిపారు. మండల పరిధిలోని జేబీఆర్ఈసీ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజశ్రీ పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉన్నత విద్యలో క్రమశిక్షణ అలవరచుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జితేందర్‌రెడ్డి, ఏవో కె.వి.శ్రీనివాస్‌రావు, అరుణ్‌మూర్తి, జగ్గా రాజు, ప్రభాకర్, అబ్దుల్‌రహీం, శ్రీనివాస్, ప్రసాద్, శేశగిరి, రమేశ్, నవీన్, జోత్స్న, గోపాల్, రవికుమార్, రాహుల్, మన్సూర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

చేవెళ్ల: అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ హెచ్చరించారు. శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలో సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వాటిని పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్వాడ గ్రామ పరిధిలో అనుహార వెంచర్‌లో వంశీశర్మ, దీపికారెడ్డి, అవినాశ్‌రెడ్డి, కేవీరెడ్డిలు హెచ్ఎండీఏతో పాటు గ్రామ పంచాయతీ నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. గతంలో ఈ నిర్మాణాలకు సంబంధించి మూడుసార్లు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో పాటు నిర్మాణాలు అలాగే కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో చట్టప్రకారం ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవటంతో డీఎల్‌పీఓ సతీశ్, ఎంపీఓ గీతల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. వీరే కాదు ఎవరైనా సరే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించి అనుమతులు పొందిన తరువాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కమిషనర్ వెంకట్రామ్



తుక్కుగూడ: 2024–25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం ఇస్తున్న 5 శాతం రాయితీని మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ బి వెంకట్రామ్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఆస్తి పన్ను బకాయి లేనివారు ఈ ఏడాది నూతనంగా చెల్లించే ఆస్తి పన్నుకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ నెల 30 చివరి గడువన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీలో 90 శాతం మేరకు ఆస్తి పన్ను వసూలు చేశామన్నారు.

చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం



సమావేశానికి వెళ్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, నాయకులు

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చేవెళ్లలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి షాబాద్ మండలం నుంచి 150 వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం 110 రోజుల్లోనే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి సామాన్య ప్రజలకు అండగా నిలిచిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అండగా నిలిచిందన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మూడోసారి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని సూచించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కుమ్మరి దర్శన్, దయాకర్‌చారి, దర్శన్, రాంమోహన్‌గుప్తా తదితరులున్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో యజ్ఞం చేయిస్తున్న పూజారి

తుక్కుగూడ: రావిర్యాల సూర్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ప్రారంభమైంది. సోమవారం ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని లక్ష్మీనరసింహ, ఆంజనేయ స్వామి విగ్రహాలతో పాటు శివునికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. యజ్ఞయాగాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, కౌన్సిలర్ సుమన్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్: పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయని యాంటీ కరప్షన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాకీర్‌షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి వికారాబాద్ ఫామ్‌హౌస్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మహమ్మద్ ఆలంఖాన్, ముజీబ్‌ఆలం ఖాన్, ఉస్మాన్‌ఖాన్ తదితరులున్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న జాకీర్‌షరీఫ్

ఘనంగా ఇఫ్తార్ విందు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి, ఊరేళ్ల, మల్కాపూర్ గ్రామాల్లో జరిగిన ఇఫ్తార్ విందుల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెప్పి పండ్లు తనిపించారు. ముస్లింలు రంజాన్ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తూ ఉపవాసదీక్షలతో జరుపుకుంటారన్నారు. మల్కాపూర్‌లో మాజీ ఉపసర్పంచ్ జాఫర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, ఆయా గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు



నిర్వాహకులతో భీంభరత్, మండల నాయకులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో గ్రామస్తులు మల్లికార్జునస్వామి, బీరప్ప ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పాల్గొని స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మండలానికి చెందిన నాయకులు మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఎండీ ఎజాజ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, రాములు, సంతోష్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు పూజల్లో పాల్గొన్న వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

నియామకం



విజయారెడ్డి

మాడ్గుల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా ఇటిక్యాల విజయారెడ్డిని నియమించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు జయమ్మ చేతుల మీదుగా విజయారెడ్డి నియామకపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ మిత్ర మండలి వ్యవస్థాపకులు సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు లో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గోదా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వట్టిపల్లి రామశర్మ తదితరులు కల్యాణం, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. రాత్రి రథోత్సవాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉన్ని వెంకటయ్య, సోలిపేట అమరేందర్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, చందా భాస్కర్, సోలిపేట రంగారెడ్డి, బాణాల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఎస్ఐ రవినాయక్



క్రీడాకారులతో ఎస్ఐ రవినాయక్, నిర్వాహకులు

మంచాల: క్రీడల్లో గెలుపోటములు సహజం అని.. వాటిని సమానంగా స్వీకరించాలని మంచాల ఎస్ఐ రవినాయక్ అన్నారు. మండల పరిధిలో ఆరుట్లలో గత కొన్నిరోజులుగా నిర్వహించిన ఆరుట్ల ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలు సోమవారంతో ముగిశాయి. గెలుపొందినవారికి ఎస్ఐ రవినాయక్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిరూ.30వేలు థండర్స్ జట్టు, ద్వితీయ బహుమతి రూ.20వేలు ఆరుట్ల లెంజెడ్ జట్టు, తృతీయ బహుమతి రూ.15వేలు ఆరుట్ల పవర్ హిట్టర్ జట్టు, నాల్గవ బహుమతి రూ.10వేలు ఆరుట్ల టైటాన్స్ జట్టు గెలుచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, రమేష, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య గౌడ్, వివిధ జట్ల ఆర్గనైజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.